క్లుప్తంగా

ధర్నాను విజయవంతం చేయండి

సత్తుపల్లి: కేంద్రం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు శుక్రవారం సత్తుపల్లి అంబేడ్కర్ సెంటర్‌లో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె.రఫీ పిలుపు నిచ్చారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన పార్టీ ముఖ్యుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమా, చల్లగుండ్ల కృష్ణయ్య, ఆత్మ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, జెడ్పీటీసీ రామారావు, దొడ్డా శంకర్‌రావు, కృష్ణారెడ్డి, మట్టా ప్రసాద్, అద్దంకి అనిల్, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

తల్లాడ: కేంద్రప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యాన శుక్రవారం తల్లాడలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొసైటీ చైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, నాయకులు కేతినేని చలపతిరావు, పెరికె నాగేశ్వరరావు, టి.రఘు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంకమ్మ జాతర ప్రారంభం

మధిర: దెందుకూరు గ్రామంలో గ్రామ ఇలవేల్పు దేవతలైన అంకమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమైంది. శుక్రవారం, శనివారం అమ్మవారికి పూజలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సర్పంచ్ కోట విజయ శాంతి, గ్రామ పెద్దలు కోరారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను బీజేపీ గ్రామశాఖ అధ్యక్షులు పురం గోపాలరావు- బ్రహ్మేశ్వరి దంపతులు గురువారం వితరణగా అందజేశారు. హెచ్ఎం కౌసర్ భేగం, నూతక్కి నర్సింహారావు, దేవరకొండ కోటేశ్వరరావు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, పుల్లారావు, చందు తదితరులున్నారు.

కారేపల్లి: మండల పరిధిలోని మాణిక్యారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శ్రీ బాలాజీ ఎస్టేట్స్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లను, స్టడీ మెటీరియల్ అందజేశారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ మోటివేటర్ ఎం.శ్రీనివాసరావు, నాగభూషణం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. హెచ్ఎం పి.జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

వైరారూరల్: వైరాలోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు (శుక్రవారం) సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధికగుప్తా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వేల్పుల పావని అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

పినపాక ఫీడర్‌లో విద్యుత్ సరఫరా బంద్

తల్లాడ: మండలంలోని పినపాక ఫీడర్‌లో నేడు శుక్రవారం ఉదయం మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డిగూడెం, మంగాపురం, అంబేడ్కర్ నగర్, గొల్లగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

కొణిజర్ల: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని పల్లిపాడు, లాలాపురం, దిద్దుపూడి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ సుంకర స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు.

గుర్తింపు రద్దు చేయాలి

ముదిగొండ: కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పానుకుల సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముదిగొండలో విద్యార్థులు నిరసన, రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్‌లోని కళాశాలలో విద్యార్థి ఆత్మహత్యకు కారకులను కఠినంగా శిక్షించాలన్నారు. వెంకట్, శ్రీచరణ్, మనో, శ్రీను, దాస్, గణేష్, మహేష్, యాసిన్, వెన్నల, శిరీష, భవాని, మైత్రి పాల్గొన్నారు.

బైక్ చోరీ

పెనుబల్లి: వియం బంజర్‌కు చెందిన జెన్నారెడ్డి రాజశేఖర్‌రెడ్డి తన బజాజ్ పల్సర్ బైక్‌ను ఇంటి ఆవరణలో పార్కు చేసి ఉండగా బుధవారం రాత్రి అపహరణకు గురైనట్లు వియంబంజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ఎస్సై సూరజ్ తెలిపారు. కాగా వారం రోజుల్లో ఐదుకు పైగా ద్విచక్రవాహనాలు చోరీకి గురైనట్లు స్థానికులు తెలుపుతున్నారు.

భోజన కార్మికుల ధర్నా

కల్లూరు: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని రుతూ గురువారం మధ్యాహ్న భోజన కార్మికులు ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలని కోరుతూ ఆర్‌డీఓ సూర్యనారా యణకు వినతిపత్రం అందచేశారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, కార్మికులు సత్యవతి, చిట్టెమ్మ, మారెమ్మ, శారద, రాంకుమారి తదితరులు పాల్గొన్నారు.

మక్కలకు సాగు నీరేది?

ఎండుతున్న మొక్కజొన్న
- చివరి భూములకు అందని సాగర్‌జలాలు
- బీబీసీ కింద 16 వేల ఎకరాల్లో సాగు
- 1,300 క్యూసెక్కులకు గాను 600 క్యూసెక్కుల నీరే విడుదల
- ఆందోళన చెందుతున్న రైతాంగం



అల్లపాడు మైనర్ వద్ద రెగ్యులేటర్ లేకపోవడంతో అడ్డువేస్తున్న రైతులు (ఫైల్)





బోనకల్ మండలం అల్లపాడులో ఎండిపోతున్న మొక్కజొన్న

బోనకల్: ఎన్నో ఆశలతో మొక్కజొన్న సాగు చేసిన రైతులు నీటి ఎద్దడితో పరేషాన్ అవుతున్నారు. బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని పంటకు సాగర్ జలాలు అందక ఎండిపోతున్నాయి. మండల పరిధిలోని 16 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగుచేశారు. గతేడాదితో పోలిస్తే ఈసారి 2వేలు ఎకరాల్లో అదనంగా సాగు చేశారు. అల్లపాడు, కలకోట, నారాయణపురం, పోలంపల్లి, లింగాల మైనర్ కాలువ కింద పంట వేసిన రైతులు నీటి తడులు సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాగర్ నిండా నీరు ఉన్నప్పటికీ వారబందీ విధానం అమలు చేయడంతో బీబీసీ పరిధిలోని చివరి భూములకు నీరందడంలేదు. బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు 1,375 క్యూసెక్కుల నీటిని విడుదల చెయ్యాల్సి ఉండగా కాల్వకట్టలు బలహీన పడడం, షిల్ట్ ఉండడం వలన నీటి సరఫరా సక్రమంగా జరగక పోవడంతో నీటి విడుదల కేవలం 600 – 800 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు.

చివరి వరకు అందని సాగునీరు..

కొణిజర్ల నుంచి బోనకల్ బ్రాంచ్ కెనాల్‌లోని చివరి భూములకు నీరు చేరాలంటే వారం రోజులు పడుతుందని వెంటనే నీటి సరఫరా నిలిపివేస్తుండడంతో తమ పొలాల వరకు నీరు చేరడంలేదని రైతులు వాపోతున్నారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పండించిన పంట నీరందక కళ్లముందే ఎండిపోతుంటే రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క ఎకరానికి పెట్టుబడి కౌలుతో కలిపి రూ.40 వేలు అవుతుందన్నారు. పెరిగిన ఎండలు కారణంగా కంకి దశలో ఎన్న మొక్కజొన్నకు ఎక్కువ తడులు అవసరమవుతాయని, దీనికి తోడు వారబందీ పద్ధతి తమ కొంప ముంచుతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగర్ జలాల కోసం అన్నదాతలు ఇరిగేషన్ కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో పురుగుమందు డబ్బాలతో రోడ్డుపై రాస్తారోకోలు, ఇరిగేషన్ కార్యాలయం ముందు ధర్నాలు, అధికారులను నిర్బంధించడం లాంటి సంఘటనలు పరిపాటిగా మారాయి. ఎండుతున్న పంటలను కాపాడుకునే పరిస్థితి లేక నిరాశా, నిస్పృహలతో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

పంట ఎండిపోతోంది..



అల్లపాడు మైనర్ కాలువ కింద ఆరెకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశాను. కౌలుతో కలిపి రూ.2 లక్షలు పెట్టుబడి అయింది. ప్రస్తుతం పంట కంకి దశలో ఉన్నందున నీటి తడులు అవసరం ఉంది. అల్లపాడు మైనర్ కాలువ వద్ద రెగ్యులేటర్ లేకపోవడం వలన నీరు రావడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. నీనీరు విడుదల చేస్తేనే పంట దక్కే అవకాశం ఉంది.

– చెన్నకేశ పుల్లారావు, రైతు, అల్లపాడు

వారబందీ ఎత్తివేయాలి



వారబందీ విధానంతో పొలానికి నీరందడం లేదు. నేను 4ఎకరాలలో మొక్కజొన్న సాగుచేశాను. బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు సరిపడా నీరు రాక చివరి భూములకు నీరు చేరడంలేదు. కళ్లముందే పంట ఎండిపోతుంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో తమ భూములకు నీరందడంలేదు. వారబందీ ఎత్తివేసి పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలి.

– అల్లిక అబ్బయ్య, రైతు, అల్లపాడు

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉమామహేశ్వరరావు

సత్తుపల్లిటౌన్: ప్రతీ ఒక్కరు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య అన్నారు. పట్టణంలోని 1వ వార్డు గుడిపాడులో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అమీర్‌ఖాన్, కౌన్సిలర్ మారుతి సూరిబాబు, ఏఎన్ఎంలు కామేశ్వరి, రమాదేవి, నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమరుల ఆశయాలకు కృషి

చింతకాని: అమరుల ఆశయ సాధనకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని కోమట్లగూడెం గ్రామంలో పార్టీ నాయకుడు అవులూరి లక్ష్మారెడ్డి సంస్మరణ సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, రావి శివరామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు దూసరి శ్రీరాములు, పగిడిపల్లి ఏసు, నాయకులు వేముల జానికిరాములు, అవులూరి రామిరెడ్డి, బక్కిరెడ్డి, సీతారామిరెడ్డి, నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు లకిరెడ్డి బాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న పోలీసులు

కల్లూరు: తలసేమియా బాధిత చిన్నారుల కోసం కల్లూరు పోలీసుల ఆధ్వర్యాన గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన కల్లూరు ఏసీపీ ఎం.రామానుజం మాట్లాడుతూ సంకల్ప ఆర్గనైజేషన్ నిర్వాహకులు చేస్తున్న కృషికి సహకరించేందుకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. శిబిరంలో సీఐ హనూక్, ఎస్సై రఘు తదితరులు రక్తదానం చేయగా, ప్రతిభ కళాశాల ప్రిన్సిపాల్ రామాల ప్రసాద్, ఎంపీపీ బీరవల్లి రఘు, రైతు సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘుతోపాటు జాబిశెట్టి శ్రీనివాసరావు, రాంబాబు, పెడకంటి రామకృష్ణ, అంజి, ఇమ్రాన్, గంగవరపు శ్రీనివాసరావు, సత్యనారాయణరెడ్డి, సర్రాబు వెంకటేశ్వరరావు, ఏఎస్సైలు పుల్లారావు, చారి పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణ వేడుకలు



కందుకూరు వెంకటేశ్వరస్వామి ఆలయం

వేంసూరు: మండల పరిధిలోని కందుకూరు గ్రామాల్లో కొలువుదీరిన శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు ఈ నెల 3 నుంచి 8 వరకు నిర్వహించనున్నారు. 3న ధ్వజారోహణం, 4న స్వామివారి ఎదుర్కొలు ఉత్సవాలు, 5న స్వామివారి కళ్యాణం, 6న దివ్య రథోత్సవం, 7న దొంగల దోపోత్సవం, 8న స్వామి వారి పవళింపు సేవ నిర్వహించనున్నారు. కల్యాణ వేడుకల సందర్భంగా ఆలయాన్ని రంగులు వేసి ముస్తాబు చేయడంతో పాటు రకరకాల పూల తో అలంకరించారు.

సీసీ కెమెరాలు వితరణ

పెనుబల్లి: పెనుబల్లి ముత్యాలమ్మ తల్లి ఆలయానికి గ్రామానికి చెందిన కంటి కృష్ణయ్య, హనుమంతరావు జ్ఞాపకార్థం రూ.18 వేల విలువైన సీసీ కెమెరాలను ఆయన కుమారుడు సాయి విజయ్ సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వంగా కృష్ణ గౌడ్, వంగా చెన్నారావు, మిద్దె స్వామి, వేముల బాబురావు, చలమాల నరసింహారావు, మల్లెల శ్రీను, కంటి మోహన్‌రావు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు, మహిళలు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని రాస్తారోకోలు నిర్వహించారు. ధరలు తగ్గించాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎర్రుపాలెం: నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కల్లూరు: ఆర్‌డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



కొణిజర్ల: నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, మహిళలు

దేశ వ్యాప్తంగా రుణమాఫీ అమలు చేయాలి



పాదయాత్ర చేస్తున్న నాయకులు

వైరా/కొణిజర్ల: దేశ వ్యాప్తంగా రైతుల రుణాలను మాఫీ చేయడంతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పథకం కొనసాగించాలనే డిమాండ్‌తో తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు, కొణిజర్ల మండలం లాలాపురంలో చేపట్టిన పాదయాత్రలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ... ఏప్రిల్ 5న ఢిల్లీలో 10 లక్షల మంది రైతులు, కార్మికులతో మహా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపడుతున్న ఈ ఆందోళనకు తరలిరావాలని కోరారు. నాయకులు మల్లెంపాటి రామారావు, మచ్చా మణి, సుంకర సుధాకర్, ఇమ్మడి సుధీర్, నర్సింహారావు, రాంబాబు, రామయ్య, రవి, విద్యాసాగర్ రావు, కృష్ణ, వీరమ్మ, మురళి, రామారావు, వెంకటేశ్వరరావు, తిరుపతిరావు, చింతనిప్పు చలపతిరావు, అనుమోలు రామారావు, సంక్రాంతి నరసయ్య, వడ్లమూడి మధు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు గ్రామానికి చెందిన రైతు బొగ్గుల శ్రీనివాసరెడ్డి ఇటీవల మృతిచెందగా ఆయన పేరిట మంజూరైన గ్రూపు ఇన్సూరెన్స్ రూ. 50 వేల నగదును గురువారం అందజేశారు. అయ్యగారిగూడెం సొసైటీలో ఇన్సూరెన్స్ చేయించగా మండలకేంద్రంలోని కోఆపరేటివ్ బ్యాంకులో మృతుని భార్య రాధికకు బ్యాంకు మేనేజర్ మగినం వీరభద్రం, సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు నగదు అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, భానుప్రియ, సూపర్‌వైజర్ మహేష్, సొసైటీ సీఈఓ మోహన్‌రావు, సిబ్బంది మురళీ, రమణారెడ్డి, తదితరులున్నారు.

అనుమతి లేని వెంచర్‌లో పనుల నిలిపివేత

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో అనుమతి లేకుండా అభివృద్ధి చేస్తున్న వెంచర్ నిర్మాణ పనులను ఎంపీపీ పటోళ్ల ప్రభాకర్‌రెడ్డి గురువారం నిలిపివేశారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాల ప్రకారం... తనికెళ్లలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ఓ పెట్రోలు బంక్ సమీపంలో భూమి చదును చేసి మట్టి పోసి వెంచర్ నిర్మాణ పనులు చేస్తుండగా ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మురళిలు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమతులు లేకుండా పనులు చేస్తున్నట్లు గుర్తించారు. నాలా కన్వర్షన్ కాకుండా అభివృద్ధి పనులు చేయకూడదని చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పనులు నిలిపి వేయించారు. నాలా కన్వర్షన్ వచ్చిన తర్వాత సుడా అనుమతి డీటీపీసీ అనుమతి తీసుకుని అభివృద్ధి పనులు మొదలు పెట్టాలని సూచించారు.

రబీ పూర్తయ్యే వరకు నీరందిస్తాం

ముదిగొండ: ఈ ఏడాది రబీలో పంటలు పూర్తయ్యే వరకు సాగునీరందిస్తామని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. మండలంలోని వనంవారి కిష్టాపురం మేజర్ సాగర్ కాలువ వల్లాపురం, అమ్మపేట, గంధసిరి గ్రామాలలోని మండల నాయకులతో కలిసి గురువారం పర్యటించారు. సాగర్ కాలువల వెంబడి తిరిగి నీటి సరఫరా తీరును పరిశీలించారు. రైతులతో నేరుగా తమ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల సాగర్ నీరందడం లేదని ధర్నాలు, రాస్తారోకో చేసిన రైతులు కమల్ రాజు దృష్టికి తీసుకురావడంతో స్పందించి పరిశీలించారు. రైతులకు సాగునీరందించే విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సామినేని హరిప్రసాద్, రైతుసమితి మండల కన్వీనర్ పోట్ల ప్రసాద్, నాయకులు వెంకట్, మీగడ శ్రీనివాస్‌యాదవ్, తోట ధర్మ, రైతులు పాల్గొన్నారు.



కాలువను పరిశీలిస్తున్న జెడ్పీచైర్మన్ కమల్‌రాజు

కంటివెలుగు శిబిరం ప్రారంభం..

బోనకల్: కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు కోరారు. మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ మర్రి తిరుపతిరావు, బందం శ్రీను, పారా ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా కేసీఆర్



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్

ఏన్కూరు: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేదలకు అండగా ఉంటున్నారని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ తెలిపారు. మండల పరిధిలోని నూకలంపాడు, జన్నారం ఎస్టీకాలని, గార్లఒడ్డు, ఏన్కూరు, కోదండరామాపురం తండ, బురదరాఘవాపురం, పీకే బంజరా గ్రామపంచాయితీలలో గురువారం గడపగడపకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాణోతు సురేష్‌నాయక్, భూక్య లాలు, శెట్టిపల్లి నరేష్, ఈపూరి సైదులు, కట్ట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా విభాగం అధ్యక్షురాలిగా సక్కుబాయి

వైరా: బీఆర్ఎస్ వైరా పట్టణ మహిళా అధ్యక్షురాలిగా శాంతినగర్‌కు చెందిన బాణోత్ సక్కుబాయికి ఎమ్మెల్యే రాములునాయక్ గురువారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, ఏఎంసీ చైర్మన్ బీడీకే రత్నం, నాయకులు షేక్ లాల్ మహ్మద్, కట్టా కృష్ణార్జునరావు, మద్దెల రవి, బాణాల వెంకటేశ్వరరావు, పసుపులేటి మోహనరావు, మచ్చా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్‌పై పన్ను తగ్గించాలి

వేంసూరు: పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఉత్పత్తులపై రాష్ట్ర ప్రభుత్వ తన పన్ను తగ్గించాలని కోరుతు గురువారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం పార్టీ మండలాధ్యక్షుడు పర్స రాంబాబు, జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు మాట్లాడుతూ... బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తమ పన్ను తగ్గించుకున్నాయని, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాల సీతారామన్ పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవడానికి సిద్ధంగా ఉన్నందున దానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, తుమ్మురు చంద్ర మోహన్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, తిరపతి రావు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

మధిర: పీఆర్సీని వెంటనే అమలు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు గురువారం మధిర సబ్ డివిజన్ విద్యుత్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగులు సిహెచ్ ప్రభాకర్ రావు, చెరుపల్లి శ్రీధర్, నరసింహారెడ్డి మాట్లాడారు. యాజమాన్యం సంవత్సర కాలంగా పీఆర్సీ కమిషన్ వేసి ఇంతవరకు దానిని అమలు చేయకపోవడంతో వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ శాఖలో వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి వర్మ, రాజేశ్వరి, వెంకటేశ్వరరావు, శ్యాంసుందర్, బాబు సాహెబ్ పాల్గొన్నారు.

నట్టల మందు పంపిణీ

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ మర్రి తిరుపతిరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మర్రి నాగేశ్వరావు, పదిలం నరసింహారావు, సురేష్, పశువైద్య సిబ్బంది నాగేంద్రకుమార్, శ్రీకాంత్, గోపాలమిత్రలు అశోక్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పరిశీలన

కల్లూరు: కల్లూరు పంచాయతీ పరిధిలో అనర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించారంటూ కొందరు ఫిర్యాదు చేయగా ఆర్డీఓ సీహెచ్ సూర్యనారాయణ ఫిర్యాదులో ఉన్న 27 గృహాలను గురువారం పరిశీలించారు. వీరంతా గృహాలు తీసుకునేందుకు అర్హులేనని తమ పరిశీలనలో తేలినట్లు ఆర్‌డీఓ విలేకరులకు తెలిపారు.

వేతనాలు ఇవ్వాలని వినతి

ఎర్రుపాలెం: నాలుగు నెలలుగా వేతనాలు లేక తీవ్ర అవస్థలు పాలవుతున్నామని ఇప్పటికైనా జీతాలిప్పించాలని కోరుతూ గురువారం స్థానిక ఎంపీడీఓ బి.శ్రీనివాసరావును కలిసి పంచాయతీ వర్కర్లు మొర పెట్టుకున్నారు. ఈ మేరకు వర్కర్ల సంఘం నాయకులు దూదిగం శ్రీనివాసరావు, జి.నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. వడ్డీలకు అప్పులు తెచ్చి కుటుంబాల పోషణ చేసుకుంటున్నట్లు వాపోయ్యారు. జీతాలు లేకుండా ఎలా పని చేయాలో ఆలోచన చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 10 కల్లా జీతాలు చెల్లించకపోతే పనులు మానేసి సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.గోపాలరావు, పి.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, వై.కృష్ణారావు, ఈశ్వరమ్మ, మల్లేశ్వరి, కె.మైనర్‌బాబు, ఎ.లక్ష్మి, తదితరులున్నారు.

బీజేపీ విజయోత్సవ ర్యాలీ

ఏన్కూరు: ఈశాన్య రాష్ట్రాలలో బీజేపీ విజయం సాధించిన సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన సెంటర్‌లో స్వీట్లు పంపిణీ చేసి, బాణసంచా కాల్చి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొవ్వూరి నాగేశ్వరరావు, నల్లమోతుల రమేష్, నరుకుళ్ల వెంకటేశ్వర్లు, మోరబోయిన కృష్ణ, గుగులోతు శశికిరన్, ఈలప్రోలు వెంకన్న, రెంటపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో ఫేర్‌వెల్ డే

కారేపల్లి: కారేపల్లి కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయం, జూనియర్ కళాశాలలో విద్యార్థులు గురువారం ఫేర్‌వెల్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్పెషలాఫీసర్ ఝాన్సీ సౌజన్య , విజయలక్ష్మి, స్వాతి, కవిత, సంధ్యారాణి, కె.కృష్ణవేణి పాల్గొన్నారు.

ముదిగొండ: ప్రతీ విద్యార్థి ఇష్టంతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని ముదిగొండ క్లస్టర్ హెచ్ఎం వెంకట్రామిరెడ్డి అన్నారు. మండలంలోని న్యూ లక్ష్మీపురం కేజీబీవీ ఆశ్రమ పాఠశాల, కళాశాలలో గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ ఇందిర, సీత, నిర్మల, సుమలత, సుజాత, షఫియా, రజని, జ్యోతి, మాధవి, యాస్మిన్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా ఎన్నెస్పీ బ్రిడ్జి



మండలంలోని చిరుమర్రి - పమ్మి వెళ్లే మార్గంలో ఎన్నెస్పీ కల్వర్టు బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ మలుపుగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కానరాక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెనను వెడల్పు చేయాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

– ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : ఎం.వెంకటేశ్వర్లు, ఈఈ, జలవనరుల శాఖ

సెల్ నంబర్ :97058 77963